సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 17 । ఆగస్టు । 2024



అంతా.. 'అధికారం' కనుసన్నల్లోనే...

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. - 8లో



హత్య కేసును ఛేదించిన పోలీసులు

లాభాపేక్షతో మహిళను హత్యచేసి, ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుపోయిన కేసులో నిందితురాలిని జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



కరాటే పోటీల్లో ఆకాష్ ప్రతిభ

హైదరాబాద్‌లో ఈ నెల 4న జరిగిన జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫు ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో గజపతినగరానికి చెందిన గజ్జెల ఆకాష్ సత్తా చాటాడు. - 8లో

న్యూస్‌రీల్

వైద్యుల నిరసన ర్యాలీ

పార్వతీపురం టౌన్: కోల్‌కతా ఆర్‌జీకేఎల్‌ఆర్ ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై జరిగిన పాశవిక హత్యాచారాన్ని ఖండిస్తూ శుక్రవారం ఏపీపీహెచ్‌సీడీఏ, ఐఎంఏ, ఏపీజీడీఏ, ఏపీఎన్జీజీఓ అసోసియేషన్, ఏపీఎంసీఏ, పారామెడికల్ యూనియన్ల ఆధ్వర్యంలో పార్వతీపురంలోని వైద్యులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వైద్య నిపుణులకు న్యాయం, భద్రత కల్పించాలని కోరుతూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు అత్యవసరేతర సేవలు నిలిపివేస్తామని తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురంలోని వైద్యులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ బాధ్యతల స్వీకరణ



ఆర్డీఓ వెంకటరమణ

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు ఇన్‌చార్జి పీఓగా పాలకొండ ఆర్డీఓ వి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విద్య, వైద్యం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి కృషి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పర్యాటక అధికారి ఎన్.నారాయణరావును ఆదేశించారు. 2047 నాటికి 'ఎకనామికల్ మాస్టర్ ప్లానింగ్ ఫర్ డెవలపింగ్ విశాఖపట్నం సిటీ రీజియన్ గ్రోత్ హబ్' అంశంపై శుక్రవారం నీతి ఆయోగ్ అధికారులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధికి అవకాశాలు ఉన్న రంగాలను గుర్తించాలని, తద్వారా నూతన పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు దిశగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధి పెద్దఎత్తున చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. వారం రోజుల్లో జిల్లాలోని అవకాశాలపై నివేదిక తయారుచేసి సమర్పించాలని ఆదేశించారు. అందమైన ప్రకృతి వనరులు, అనేక ఔషధ విలువలు గల మూలికలకు జిల్లా ఆలవాలమన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఆరంభమైతే పార్వతీపురం మన్యం జిల్లాకు సులభంగా రాకపోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుతో పర్యాటకులను విశేషంగా ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తోటపల్లి, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లలో జలక్రీడల నిర్వహణ అవకాశాలు పరిశీలించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని పర్యాటక అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు అదనపు సౌకర్యాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎస్.వి.కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వి.రాజు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు మకరతోరణం వితరణ



మకరతోరణం అందజేస్తున్న భక్తులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాలకొండ కోటదుర్గమ్మ వారికి పట్టణానికి చెందిన భక్తులు పి.మల్లేశ్వరరావు, జ్యోతి దంపతులు, కె.దుర్గాఆనందరావు, త్రివేణి, పి.విశ్వేశ్వరరావు, అమరజ్యోతి, పి.సీతారాం, లక్ష్మి దంపతులు 2 కేజీల 531 గ్రాముల వెండితో తయారుచేసిన మకరతోరణాన్ని ఈఓకు మురళీకృష్ణకు శుక్రవారం అందజేశారు. ఎం.దుర్గాప్రసాద్ దంపతులు 984 గ్రాముల వెండి దీపపు కుందెలను వితరణగా అందించారు. సాయివరప్రసాద్ గుప్త రజా మేళం డ్రమ్స్‌ను సమకూర్చారు. ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రంగుపూసి.. నిధులు దోచి..!



ఇవి బొబ్బిలి సమీపంలోని మెట్టవలస గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన సచివాలయ భవనాల సముదాయం. వాటిలో రూ.**20.80** లక్షలతో ఆస్పత్రి భవనం, రూ.**43.60** లక్షలతో గ్రామ సచివాలయం, మరో రూ.**23.94** లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనాలను నిర్మించింది. అదీ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో!



ఇదే బొబ్బిలిలో పెట్టిన అన్న క్యాంటీన్ ఇది. వాస్తవానికి 2019 ఫిబ్రవరి 10న అంటే 2019 సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందునాటి మాట. అప్పటి గనుల శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే బేబీనాయన సోదరుడు ఆర్‌వీ సుజయకృష్ణ రంగారావు ప్రారంభించారు. అప్పట్లోనే ఈ క్యాటీన్ నిర్మాణానికి రూ.**38** లక్షలు అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులు చాలవని చెప్పి మరో రూ.**15** లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించారు. మొత్తం రూ.**53** లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఆ అద్భుత భవనం ఇదే. తీరా అందులో వంద మందికి మించి ఏ రోజూ భోజనాలు పెట్టిన దాఖలాలు లేవు. ఇప్పుడు మళ్లీ దాన్నే తెరవడానికి రూ.5 లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు.







ఇది నెల్లిమర్ల మండల కేంద్రంలో నిర్మాణమవుతోన్న అన్న క్యాంటీన్. దీని నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.**40.62** లక్షలు మంజూరయ్యాయి. రూ.**25.37** లక్షల వరకు ఖర్చుతో కొంత మేర నిర్మాణ పనులు చేశారు. ఇప్పుడు మిగులు పనులకు రూ.**15.25** లక్షలు మంజూరయ్యాయి. ఈ చిన్న క్యాంటీన్ నిర్మాణానికి రూ.**40** లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారంటే ఆశ్చర్యమే మరి.

ఇది నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా నిర్మించిన మోడల్ గ్రామ సచివాలయం. దీని నిర్మాణానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.**40** లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.**40** లక్షలు వెచ్చించారు. రెండు అంతస్తుల్లో అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఈ భవనం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది.





ఇది పార్వతీపురం మండలంలోని ములగ గ్రామంలోని సచివాలయం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీన్ని రూ.**35** లక్షల వ్యయంతో నిర్మించింది. సేవల నిలయంగా తీర్చిదిద్దింది.



ఇది పార్వతీపురం పట్టణం బెలగాం చర్చి కూడలిలో 2019 జనవరి 26న ప్రారంభించిన అన్న క్యాంటీన్. దీని నిర్మాణానికి అప్పట్లోనే రూ.**51** లక్షలు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని 2020 నుంచి పట్టణ ఆరోగ్య పారిశుద్ధ్య కార్యాలయంగా ఉపయోగించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు ఖాళీ చేయించేశారు. మళ్లీ రూ.**3** లక్షల ఖర్చుతో మరమ్మతులు చేయించి అన్న క్యాంటీన్‌గా మార్చేస్తున్నారు.

దేశం, రాష్ట్రంలోని వివిధ ఆలయాలు.. ట్రస్టుల ఆధ్వర్యంలో లక్షలాది మందికి అన్నదానం నిత్యకృత్యంగా సాగడం మనం చూస్తుంటాం. అక్కడ ఏ హంగామా ఉండదు. కడుపునిండా భోజనం మాత్రం దొరుకుతుంది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న అన్న క్యాంటీన్ల పరిస్థితి.. వాటి ప్రచార హంగామా చూసి జనం విస్తుపోతున్నారు. పేరుకే అన్న క్యాంటీన్లని.. దాని ముసుగులో నిధుల దోపిడీ చాపకింద నీరులా సాగిపోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పాతభవనాలకు రంగుపూసి లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం.. కొన్నిచోట్ల ప్రజలకు వివిధ రకాల సేవలందించే కేంద్రాలను అధికార బలంతో అన్న క్యాంటీన్లుగా మార్చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టేది పిడికెడైతే.. ప్రచారం బారెడులా ప్రభుత్వ తీరు ఉందంటూ సభ్యసమాజం తప్పుబడుతోంది.



రాజాంలోని అన్న క్యాంటీన్‌కు తుదిమెరుగులు అద్దుతున్న కార్మికులు



పాలకొండలో అన్న క్యాంటీన్ మరమ్మతు పనులు

- అన్న క్యాంటీన్లు ఆ పాత ముచ్చటే..
- 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏడు చోట్ల ప్రారంభం
- ఇప్పుడు మరో ఒకటీ రెండు పెంచడానికి ప్రయత్నాలు
- పాత క్యాంటీన్లకు హంగుల కోసం భారీగా ప్రజాధనం ఖర్చు
- కొత్త క్యాంటీన్లకు రూ.50 లక్షల వరకూ వ్యయం
- కాంట్రాక్టులన్నీ టీడీపీ నాయకుల అనుయాయులకే!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అన్న క్యాంటీన్ల ఏర్పాటు కోసం టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది. వాస్తవానికి ఈ క్యాంటీన్లు చాలా వరకు 2019 సార్వత్రిక ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు పెట్టినవే. ఇప్పుడు వాటికే పసుపు రంగుపూసి మళ్లీ తెరుస్తోంది. అదీ దఫదఫాలుగా ప్రారంభిస్తారట. ఈ క్యాంటీన్ల నిర్మాణ పనులే కాదు ఇప్పుడీ మరమ్మతుల పనులూ టీడీపీ నాయకుల అనుయాయులకే దక్కడం గమనార్హం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరిగిన నిర్మాణాలు ఏవైనా ఉన్నాయంటే అవీ అన్న క్యాంటీన్లే. విజయనగరం జిల్లాలో ఐదు, పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు మాత్రమే పెట్టారు. రూ.5కు భోజనం పెట్టి దాన్నే ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. ఇప్పుడు విజయనగరంలో మరొకటి పెరిగింది. సాలూరులో కూడా ఒకటి పెట్టడానికి శంకుస్థాపన చేస్తున్నారు. రెండు జిల్లాల్లో అన్నీ కలిపి తొమ్మిది క్యాంటీన్లే!

- విజయనగరంలో 2019లో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ నిధులు కేటాయించి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, ప్రస్తుత విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా గల ప్రకాశం పార్కు ప్రాంతంలో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. భోజనం ఒక్కంటికి రూ.35 చొప్పున థర్డ్ పార్టీ కాంట్రాక్టరుకు నిధులు ఇచ్చేవారు. ఆ రూ. 5కే భోజనం కూడా రోజుకు 70 నుంచి వంద మందికి మించి పెట్టేవారు కాదు. నిధులు దుర్వినియోగంపై అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లోని క్యాంటీన్ మరమ్మతుకు రూ.5.75 లక్షలు, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లోని క్యాంటీన్ మరమ్మతుకు రూ.7.50 లక్షలు ఖర్చు చేశారు. ఘోషా ఆస్పత్రి వద్ద మరో అన్న క్యాంటీన్ నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేశారు.
- రాజాం బస్టాండ్ ఆవరణలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి గతంలో రూ.4 లక్షలు ఖర్చు చేశారు. ప్రభుత్వం మారాక దాన్ని శానిటరీ కార్యాలయానికి వినియోగించారు. ఇప్పుడు అందులో క్యాంటీన్ తెరవడానికి హంగుల కోసం రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు.
- పాలకొండలో నిన్నమొన్నటి వరకూ పట్టణ ప్రజలకు వార్డు సచివాలయంగా సేవలందించిన భవనాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఖాళీ చేయించేశారు. దాన్ని అన్న క్యాంటీన్‌గా మార్చుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు దాదాపుగా రూ.15 లక్షలతో దీన్ని నిర్మించారు. కానీ అన్న క్యాంటీన్ ప్రారంభించలేదు. ఇప్పుడు రూ.24 లక్షల ఖర్చుతో హంగులతో తీర్చిదిద్దుతున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ ఎంపిక పరీక్ష రేపు

పార్వతీపురం టౌన్: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపిక పరీక్షను డీవీఎం పాఠశాలలో ఆదివారం నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి జి. పగడాలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపా రు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 218 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను శనివారం డీఈఓ కార్యాలయం వద్ద, ఆదివారం ఉదయం డీవీఎం పాఠశాల వద్ద తీసుకోవచ్చన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు.

అనుభవానికి 'పెద్ద'పీట



రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ నుంచి ఎమ్మెల్సీగా ధ్రువీకరణపత్రం స్వీకరిస్తున్న బొత్స సత్యనారాయణ

- ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 'బొత్స'
- వైఎస్సార్‌సీపీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నిక
- పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై సర్వత్రా హర్షం
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పదవితో పార్టీలో జోష్
- చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ క్యాడర్, నాయకుల సందడి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/చీపురుపల్లి: మూడున్నర దశాబ్దాల రాజకీయ అనుభవానికి పెద్దల సభకు వెళ్లే గౌరవం దక్కింది. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ ఖాతాలోని ఈ స్థానాన్ని దక్కించుకోవడానికి కూటమి పార్టీల కుతంత్రాలేవీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహం ముందు పటాపంచలైపోయాయి. అన్ని మార్గాల్లో ప్రయత్నించినా ఫలితం ఉండదని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడ అభ్యర్థిని నిలబెట్టలేక చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీలో సీనియర్లకు ఎల్లప్పుడూ తగిన గౌరవం లభిస్తుందని మరోసారి రుజువయ్యింది.

పకడ్బందీ వ్యూహంతో విజయం...

వంశీకృష్ణ జనసేనలోకి ఫిరాయించడంతో ఖాళీ అయిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తన సీటును నిలబెట్టుకునేందుకు తొలి నుంచి వ్యూహాత్మకంగా అడుగులేసింది. అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినప్పుడే విజయం ఖాయమని అందరికీ అర్థమైంది. కానీ సభ్యుల మెజార్టీరీత్యా తమకు గెలుపు సాధ్యం కాదని తెలిసినప్పటికీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సహా కూటమి నాయకులు చివరివరకూ కుతంత్రాలు రచించారు. వాటిని పటాపంచలు చేసేలా వైఎస్సార్‌సీపీ ముందుగానే ఈ ఎన్నికలో ఓటర్లుగానున్న స్థానిక సంస్థల సభ్యులకు తాడేపల్లిలో సమావేశం ఏర్పాటుచేశారు. టీడీపీ మంత్రాలకు ఎక్కడా లొంగిపోవద్దని సభ్యులంతా ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పోటీచేసి ఓడిపోవడమెందుకని గ్రహించిన టీడీపీ ముందుగానే పోటీ నుంచి తప్పుకుంది.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక ఇమేజ్, మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా అనుభవం, ఉత్తరాంధ్ర రాజకీయాలపై పట్టు ఉన్న బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం నెలకొంది. శాసనమండలిలో విజయనగరం జిల్లా ప్రజల గొంతుకగా ఆయన ఉంటారని హర్షం వ్యక్తమవుతోంది.

చీపురుపల్లిలో సంబరాలు

నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో బాణసంచా కాల్చారు. మిఠాయిలు అందరికీ పంచి పెట్టారు. జై జగన్, బొత్స నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

'బొత్స' రాజకీయ ప్రస్థానం ఇలా.....

విద్యార్హతలు : బీఏ
జననం : 09-07-1958
కుటుంబ వివరాలు : మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి (భార్య), డాక్టర్ సందీప్(కుమారుడు), అనూష(కుమార్తె)
రాజకీయ నేపథ్యం :
1999లో ఎంపీ(బొబ్బిలి పార్లమెంటు)
2004 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2009 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2019 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు
మంత్రిగా నిర్వహించిన శాఖలు:
భారీ పరిశ్రమలు, రవాణా, మార్కెటింగ్, గృహనిర్మాణం, మున్సిపల్, విద్యాశాఖలు

ఉపాధ్యాయులను మింగేసిన వాగు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

పాచిపెంట: ప్రతిరోజూ వెళ్లే మార్గమే మృత్యుదారిగా మారింది. వాగు రూపంలో ప్రాణాలు హరించింది. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆవేదన మిగిల్చింది. ఇద్దరు ఉపాధ్యాయుల గల్లంతుతో ఆ ప్రాంతమంతా కన్నీటి సంద్రంగా మారింది. వృత్తిరీత్యా రాష్ట్రాలు దాటి వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులు వాగులో కొట్టుకుపోవడంతో స్థానికులు విషాదంలో మునిగిపోయారు. అయ్యయ్యో అంటూ కన్నీరు కార్చారు. వారికోసం రాత్రి వరకు గాలించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహేష్ వార్డెన్‌గా, ఆర్తి సోషల్ టీచర్‌గా సరాయివలస ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్నారు. వీరు స్కూల్‌కు సమీపంలోని గురివినాయుడుపేటలో నివసిస్తున్నారు. విధులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి బయలు దేరారు. ప్రతిరోజూ వలే వాగును దాటే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో అదుపుతప్పి ఇద్దరూ కొట్టుకుపోయారు. మహేష్ వాగు లోని చెట్టుకొమ్మ సాయంతో బయటపడి వాగు అంచున పట్టుకుని కాసేపు ఉన్నా ఫలితం లేకపోయింది. అంచు కూలిపోవడంతో వాగులోనే గల్లంత య్యారు. ఆర్తి మృతదేహం లభ్యం కాగా మహేష్ ఆచూకీ కోసం రెవెన్యూ అధికారులు, పోలీసులు గాలిస్తున్నారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రవి, ఎస్‌ఐ నారాయణరావు పరిశీలించారు. వారు ప్రయాణించే బైక్ ఇసుకలో కూరుకుపోవడాన్ని గుర్తించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

శ్రావణశోభ



శ్రావణ శుక్రవారం సందర్భంగా సాలూరు పట్టణంలోని కామాక్షమ్మ తల్లి, కన్యకాపరమేశ్వరి, పంచముఖేశ్వరి స్వామి ఆలయాల్లో భక్తులు వరలక్ష్మీ వ్రతాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంతోషిమాత అమ్మవారిని కరెన్సీనోట్లతో అలంకరించారు. - సాలూరు



క్లుప్తంగా

కరాటే పోటీల్లో ఆకాష్ ప్రతిభ



తల్లిదండ్రులతో ఆకాష్

గజపతినగరం: హైదరాబాద్‌లో ఈ నెల 4న జరిగిన జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫు ఓపెన్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గజపతినగరానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి గజ్జెల ఆకాష్ సత్తా చాటాడు. పోటీల్లో ఆకాష్ బంగారు పతకాన్ని సాధించాడు. ఆకాష్‌ను పలువురు అభినందించారు.

నేడు వికసిత ఆంధ్రాపై శిక్షణ

పార్వతీపురం: వికసిత ఆంధ్రా కార్యక్రమంపై శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రణాళికాధికారి పి.వీర్రాజు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొనే కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సత్యనారాయణ

బాడంగి: మండలంలోని రామచంద్రాపురం – పాల్తేరు జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. బాడంగి మండలంలోని కోడూరుకు చెందిన రైతు సత్యనారాయణ శుక్రవారం తన స్కూటీపై వెళ్తూ.. పాల్తేరు జంక్షన్ వద్ద మలుపు వైపు తిరుగుతుండగా తెర్లాం మండలం పాములవలస గ్రామానికి చెందిన కొన్న సునీల్ తన వాహనంపై బాడంగి వస్తూ ఇద్దరూ ఢీకొన్నారు. దీంతో గాయపడిన ఇద్దరిని 108 వాహనంపై స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. సత్యనారాయణకు కుడి చేయి, వెన్నెముకకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: మండలంలోని వెంగళరాయ సాగర్ డ్యాంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమయినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... శుక్రవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు గుర్తు తెలియని పురుషుడి మృతదేహం (40) లభ్యమైంది. మృతుడు బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్, కుంకుమ రంగు షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పడితే 91211 09472 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



సురేష్(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి – పెద మానాపురం మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని బల్లిరెడిసురేష్(26) అనే యువకుడు మృతి చెందినట్టు బొబ్బిలి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పెద మానాపురానికి చెందిన మృతుడి తల్లిదండ్రులు బంగారునాయుడు, రమణమ్మ కూలి పనుల కోసం వలసపోయి తాడేపల్లిగూడెంలో కొన్నాళ్లుగా ఉంటున్నారు. మృతుడు సురేష్ నాన్నమ్మ ఇంటికి శుక్రవారం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹103	₹176	₹186

అంతా.. 'అధికారం' కనుసన్నల్లోనే...

- ఇల్లు కట్టుకునే వారికి కాకుండా కంపెనీలకు ఇసుక సరఫరా
- బొబ్బిలిలో టన్ను ఇసుక రూ.605లు, విశాఖలో టన్ను ఇసుక రూ.2800లు
- తిలా పాపం తలా పిడికెడులా ఇసుక అక్రమ విక్రయాలు



మరమ్మతులు చేయించని వెయింగ్ మెషీన్

బొబ్బిలి:

స్థానిక గ్రోత్ సెంటర్‌లోని ఇసుక స్టాక్ పాయింట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకటించిన టన్ను ఇసుక ధర రూ.605లు. విశాఖలో ఇదే ఇసుకను రూ.2,800లు పైచిలుకు విక్రయిస్తున్నారు. ఈ లాభాలకు అలవాటు పడిన విశాఖ లారీలు ఇక్కడ నుంచి కదలడం లేదు. ఏదైనా సమస్య వస్తే రాజకీయంగా పైరవీలు చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. సుమారు లక్ష టన్నుల ఇసుకలో ఇప్పటికే సగం ఖాళీ అయిపోయింది. మిగతా ఇసుక కూడా తీసుకెళిపోతే ఇక మేం ఎక్కడి నుంచి తెచ్చుకుంటామని స్థానికులు, మా ట్రాక్టర్లకు మరేం పని ఉంటుందని వాహనాల యజమానులు, డ్రైవర్లు బావురుమంటున్నారు. ఎందుకంటే ఇసుక రీచ్‌లు ప్రారంభించాలంటే వర్షాకాలం పోవాలి. అంటే దాదాపు మరో మూడు నెలలు రీచ్‌లు ప్రకటించరు. అంత వరకూ ఇక్కడి ఇసుక ఉండదని వారి అనుమానం.

అంచనాతోనే ఇసుక లోడ్లు

పొక్లెయినర్ బకెట్‌తో ఓ సారి వేస్తే టన్నున్నరగా అధికారులు లెక్క గడుతున్నారు. కానీ ఇక్కడి వెయింగ్‌మెషీన్‌ను మరమ్మతు చేయించడం లేదు. ఇంతకీ మెషీన్ పాడయిందా లేక అలా చెబుతున్నారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 13న్నర బకెట్లు వేస్తే 20 టన్నులు వేసినట్టు లెక్క వీరికి మాన్యువల్ రశీదులు ఇస్తూ అమౌంట్ మాత్రం ఫోన్‌పేలో తీసుకుంటున్నారు. అలాంటప్పుడు ఆన్‌లైన్ బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతున్నది.

- ఈ ఆన్‌లైన్ బిల్లు చూశారా? ఇది గ్రోత్‌సెంటర్‌లోని ఓ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో బొబ్బిలి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి వెళ్లి అన్‌లోడ్ అయిన ఇసుక బరువు 26 టన్నులుగా స్పష్టంగా సూచిస్తున్నది. గ్రోత్ సెంటర్‌లోనే ఉన్న కంపెనీకి అక్కడే ఉన్న స్టాక్ పాయింట్ నుంచి ఒకటి రెండు లారీలను పక్క గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బేబీ నాయన పేరు చెప్పుకుని ఇసుక రవాణాకు కుదుర్చుకున్నారు. అయితే వారికి మాత్రం ఎక్కువ లోడు వేసి తరలిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నులు మాత్రమే ఇస్తున్నామంటున్న అధికారులు కూటమి నాయకుల ఆదేశాలతో నిబంధనలను పట్టించుకోవడం లేదు. కనుకే ఈ లోడ్లు 26 నుంచి 28 టన్నుల పైగా తరలిస్తున్నారు. కాసులు సంపాదిస్తున్నారు.



ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో అన్‌లోడ్ అయిన బిల్లులో 26 టన్నులు చూపిస్తున్న లారీ ఇసుక బరువు

ఒకే బిల్లుతో అధిక లోడ్లు

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న రెండు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు 26 టన్నుల లెక్కన ఇసుకను ఒకే లోడులో పంపిస్తున్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వెయింగ్ మిషన్ లేకపోవడంతో ఇష్టారీతిన వాహనాలు ఒకే వే బిల్లుతో పలు దఫాలు తిరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ కంపెనీలు మాత్రం ఎంత బరువు ఉందో బిల్లు చూపిస్తాయి కదా! ఈ రకంగా కంపెనీలకు తరలిన వాహనాలు అక్కడి వెయింగ్ మెషీన్‌లో తూకం వేసి ఇచ్చిన బిల్లులలో 26 నుంచి 30 టన్నుల వరకూ వస్తున్నాయి. గ్రోత్ సెంటర్‌లోనే ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అక్కడే ఉన్న కంపెనీలకు ప్రయాణం కేవలం పావు గంట మాత్రమే పడుతుంది. దీంతో ఒకే వే బిల్లుతో పలు దఫాలు ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఆపరేటర్లు, అక్కడి సిబ్బంది పాత్ర ఉందని స్థానిక వాహన యజమానులు ఆరోపిస్తున్నారు.



లారీలకు లోడవుతున్న ఇసుక

☛ ఈ చిత్రంలోని లారీలను చూడండి! బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఇసుక ముందుగా స్థానికుల అవసరాలకు మాత్రమే ఇస్తాం. ఆ తరువాత జిల్లా వాసులకు, ఆ తరువాత పార్వతీపురం మన్యం జిల్లా వాసులకు ఇచ్చాక మిగతా జిల్లాలకు ప్రాధాన్యమిస్తాం. ముందుగా ఇక్కడి నుంచి ఇసుక లారీలను తరలించండని మైన్స్ విజిలెన్స్ ఏడీ, బొబ్బిలి ఆర్డీఓ, తహసీల్దార్‌లు ఆదేశించారు. కానీ కూటమి నాయకుల పైరవీలు ఉండటంతో ఇక్కడి ట్రాక్టర్లకు కానీ, నాటుబళ్లకు కానీ అవకాశాలు లేకుండా కేవలం లారీలకు విశాఖపట్నం తదితర జిల్లాలకు తరలిస్తున్నారు. విశేషమేమంటే లారీల యజమానులు, డ్రైవర్లు, సిబ్బంది అంతా గ్రోత్ సెంటర్‌లోని రోడ్లను ఆక్రమించి అక్కడే వంటా వార్పూ చేసుకుని ఇసుక నింపుకున్నాకే వెళ్తున్నారు.

పని చేయని వేదిక

ఇసుకను ఇతర జిల్లాల వారు తరలించుకుంటున్నారని కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఉచిత ఇసుక అంటూ ఇదేం దోపిడీ అని బహిరంగంగా ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పరిశీలించినా పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆర్డీఓ ఆఫీసుకు తోవ లేకుండా..

గ్రోత్‌సెంటర్‌లో ఉన్న ఆర్డీఓ ఆఫీసలకు వెళ్లేందుకు తోవ లేకుండా రోడ్లపై లారీలను నిలిపి ఉంచేశారు. దీనిని కూడా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో నిలిచి ఉన్న విశాఖ లారీల పక్క నుంచే ఆర్డీఓ సిబ్బంది వెళ్లడం శోచనీయం.



ఆర్డీఓ కార్యాలయ రహదారిలోనే వంటా వార్పు చేసుకుంటున్న విశాఖ లారీల సిబ్బంది

ఫిర్యాదు చేసినా..



గ్రోత్ సెంటర్‌లో మా ట్రాక్టర్‌లకు చోటివ్వడం లేదు. పెద్ద లోడ్లతో విశాఖ తరలించుకుపోతున్నారు. మాకు చాలా ఆలస్యం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు లేవు. బిల్లు మొత్తం కన్నా ఎక్కువ ఇసుక తరలిస్తున్నారు.

– తాడ్డి ఈశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు, బొబ్బిలి

వెయింగ్ మెషీన్ పని చేయడం లేదు

ఇక్కడి వెయింగ్ మెషీన్‌ను మైన్స్ అధికారులు మరమ్మతులు చేయిస్తామన్నారు. కానీ చేయలేదు. త్వరలో ఏర్పాటు చేస్తారు. వారికి సమాచారమిచ్చాం. సీసీ కెమెరాలలో ఓ మూడు పని చేస్తున్నాయని తెలిసింది. చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీను, తహసీల్దార్

రోగులను రిఫర్ చేస్తే సహించేది లేదు...



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

- ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి
- త్వరలోనే వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి
- మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను రిఫర్ చేస్తే ఊరుకునేది లేదని స్కిల్ డవలప్‌మెంట్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు ఉండాలన్నారు. గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగికి చిన్నపాటి రోగమైనా జిల్లా కేంద్ర ఆస్పత్రికో.. విశాఖ కేజీహెచ్‌కో రిఫర్ చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకనైనా రోగులను రిఫర్ చేయడం మానుకొని ఇక్కడే వైద్యం అందించేలా చూడాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్ మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల రోగుల తాకిడికి తగినట్టు మంచాలు లేకపోవడం, పలు వైద్య పరికరాలు వినియోగంలోకి తీసుకురాలేక స్టోరేజీకే పరిమితమవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత కూడా ఉండడంతో పూర్తి స్థాయిలో రోగులకు సేవలను అందించడం కష్టమవుతున్నారు సమస్యలు విన్న మంత్రి శ్రీనివాస్ ఆస్పత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా దృష్టి సారిస్తామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

పార్వతీపురం ఎస్‌డీపీఓ బదిలీ



సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సునీల్ షియరన్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సునీల్ షియరన్‌కు గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో ఎస్ అంకిత మహావీర్ ఎస్‌డీపీఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పార్వతీపురంలో ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించడంలో సునీల్ షియరన్ కీలక పాత్ర పోషించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితురాలి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- చోరీ చేసిన 14.5 తులాల బంగారు ఆభరణాలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: లాభాపేక్షతో మహిళను హత్య చేసి, ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుపోయిన కేసులో నిందితురాలిని జిల్లా పోలీసులు నాలుగు రోజుల్లో అరెస్ట్ చేశారు. ఆమె నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. బాడంగి గ్రామం ముగడ కాలనీలో నివాసం ఉంటున్న గెద్ద కృష్ణవేణి అనే వృద్ధురాలు ఇంట్లో చనిపోయినట్లు, ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయినట్లుగా పాలకొండ పట్టణంలో నివాసం ఉంటున్న వృద్ధురాలి చిన్న కుమారుడు గెద్ద నాగేంద్ర కుమార్ ఫిర్యాదు చేశాడు. బాడంగి పోలీసులు లాభాపేక్ష హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు కృష్ణవేణి భర్త నారాయణప్పలనాయుడు హెచ్‌ఎంగా పని చేసి 2018లో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ముగడ కాలనీలోనే ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మృతురాలి పెద్ద కుమారుడు హరికృష్ణబాబు వృత్తి రీత్యా కుటుంబంతో విశాఖలోనూ, చిన్న కుమారుడు నాగేంద్ర పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ అప్పుడప్పుడు తన తల్లివద్దకు వచ్చి, ఆమె యోగక్షేమాలు చూసుకుని, అవసరమైన మందులు కొని ఇచ్చి వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో ఆగస్టు 11న కాలనీలో ఉంటున్న తన తల్లి కృష్ణవేణి ఇంటి నుంచి గ్యాస్ వాసన వస్తున్నట్లు, తలుపులు తెరిచి చూసేసరికి ఇంట్లో చనిపోయి ఉన్నట్లు, ఆమె శరీరంపై ఉన్నటువంటి బంగారు ఆభరణాలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారని, అదే గ్రామంలో ఉంటున్న తెంటు లక్ష్మి పాలకొండలో ఉంటున్న మృతురాలి కొడుకు నాగేంద్రకు ఫోన్ చేసి, సమాచారం అందించింది. అతను సంఘటనా స్థలానికి వచ్చి తన తల్లి చనిపోయినట్లు నిర్ధారించుకుని బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హత్యానేరం, దొంగతనం కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మృతురాలు కృష్ణవేణి ఇంటికి ఎదురుగా కొంతకాలంగా కలిశెట్టి లలితకుమారి అనే మహిళ నివాసం ఉంటూ, 20 రోజుల క్రితం ఇల్లు ఖాళీ చేసి, విశాఖ కంచరపాలెంకు వెళ్లిపోయినట్టు గుర్తించారు. తర్వాత ఆగస్టు 11న కాలనీకి వచ్చి, ఒంటరిగా నివాసం ఉంటున్న కృష్ణవేణిని హత్య చేసి ఆమె శరీరంపై ఉన్నటువంటి సుమారు 14.5 తులాల బంగారు ఆభరణాలు దోచుకుని వెళ్లిపోయినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో, సాక్ష్యాధారాలు సేకరించినట్లు ఎస్పీ తెలిపారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బొబ్బిలి సీఐ ఎం.నాగేశ్వరరావు, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, సిబ్బంది సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి, నిందితురాలిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితురాలు లలితకుమారిని బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేసి, విచారణ చేయగా తనకు డబ్బులు అవసరమై గెద్ద కృష్ణవేణిని చున్నీతో గొంతు బిగించి, హత్యచేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు గాజులు, ఉంగరాలు, గొలుసులు, పుస్తెల తాడు, కాసుల పేరు, చెవిదిద్దులు, శతమానం, మంగళసూత్రం తీసుకుని పరారైనట్లు నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. నిందితురాలి నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని, మిగిలిన వస్తువులను విశాఖ కంచరపాలెంలో తాను నివాసం ఉంటున్న ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, బాడంగి ఎస్‌ఐ జయంతి, సీసీఎస్ సీఐ భాగ్యం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సూత్రధారులను.. ప్రధాన నిందితులుగా చేర్చుతాం

- గంజాయి అక్రమ రవాణాపై డేగ కన్ను.. 5 చెక్‌పోస్టులు ఏర్పాటు
- రామభద్రపురంలో 20 కిలోల గంజాయి స్వాధీనం
- బొబ్బిలిలో 16కిలోల గంజాయి స్వాధీనం, 8మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



బొబ్బిలి కేసులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్:

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేపడుతున్న ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని కేసుల్లో నిందితులుగా చేర్చడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో రామభద్రపురం పీఎస్ పరిధిలో 20 కిలోల గంజాయి కేసును, బొబ్బిలి పీఎస్ పరిధిలో 16 కిలోల గంజాయి సీజ్ కేసు వివరాలు వెల్లడించారు. రామభద్రపురం కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు సమీపంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది వాహన తనిఖీలను శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఓడీ 08వీ 5769 నెంబర్ గల బైకిసీట్‌లో స్పాంజ్‌కు బదులుగా గంజాయిని కుక్కి ఒడిశా రాష్ట్రం సుంకి నుంచి రాయగడకు తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా అంపని పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన హరప్రసాద్ హంస అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌తో పాటూ బైక్‌లో దొరికిన 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. హరప్రసాద్ ఎవరి వద్ద కొనుగోలు చేశాడన్న కోణంలో విచారణ చేపట్టారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా గురసేతు గ్రామానికి చెందిన జినుపంగి అనే వ్యక్తి అతనికి గంజాయి సరఫరా చేసినట్టు, ఇందుకు మధ్యవర్తిగా అదే రాష్ట్రానికి చెందిన పతి సిగోల్ అనే వ్యక్తి వ్యవహరించినట్లు తెలిపారు. కేసులో వారిద్దరినీ నిందితులుగా చేర్చామని, త్వరలోనే మిగతా వారిని అరెస్ట్ చేస్తామని తెలిపారు. అదేవిధంగా బొబ్బిలి పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్ వెనుక ఉన్న బరియల్ గ్రౌండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎనిమిది మంది వ్యక్తులు పోలీసులను చూసి పరారీ అయ్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరిలో కర్ణాటక రాష్ట్రం తమకూరు జిల్లా నాగలాపురానికి చెందిన నాగలాపురం లోహిత్ అలియాస్ లోహిత్ భరత్ (ఎ1), బొబ్బిలికి చెందిన చింతాడ సారధి అలియాస్ నాని అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చాడన్నారు. నాలుగు కిలోల గంజాయిని లోహిత్ నుంచి ఆరు కిలోలు సారధి నుంచి బొబ్బిలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. బొబ్బిలికి చెందిన సిమిడి ప్రేమ్‌కుమార్, లంక నిఖిల్, దేవుపల్లి చందన్ అలియాస్ బంజూ అనే వ్యక్తులు ఒడిశా నుంచి వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి, తీసుకువచ్చి చింతాడ సారధికి అందజేసి, వ్యాపారంలో సహాయపడేవారన్నారు. వీరితో పాటూ ముగ్గురు జువినల్స్ అక్రమంగా గంజాయి తరలించడంలో సహకరించేవారని, వారిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన మిగిలిన నిందితుల నుంచి మరో ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన వారిపై సస్పెక్ట్ షీట్‌లు తెరుస్తామని, వారిపై నిఘా ఉంచుతామన్నారు. సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, రామభద్రపురం ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల్లో తేడాలు ఉండకూడదు

- తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా
- విజయనగరం జిల్లాలో పలుచోట్ల పర్యటన



విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో భూమి రికార్డులు పరిశీలిస్తున్న సిసోడియా

సాక్షి ప్రతినిధి, విజయనగరం: తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూమి రికార్డులు ఒకేలా నమోదై ఉండాలని, తేడాలు ఉండకూడదని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అధికారులకు సూచించారు. విశాఖ నుంచి నేరుగా విజయనగరం జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చారు. తొలుత భోగాపురం మండలంలోని పోలిపల్లి నిర్వాసితుల పునరావాస కాలనీ పరిశీలించారు. పోలిపల్లి రెవెన్యూ గ్రామ రికార్డులపై ఆరా తీశారు. భూముల క్రయవిక్రయాలు సాగినతీరుపై రైతులతో మాట్లాడారు. అసైన్డ్ భూములను ఎవరెవరు విక్రయించారనేదీ ఆరా తీశారు. తర్వాత భోగాపురంలోని తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ రికార్డులను పరిశీలించారు. ఇటీవల కాలంలో ఫ్రీహోల్డ్ భూములు ఎంతమేర రిజిస్ట్రేషన్ అయ్యిందీ అడిగి తెలుసుకున్నారు. తర్వాత బసవపాలెం గ్రామానికి వెళ్లి గత ప్రభుత్వం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి కేటాయించిన 25 ఎకరాల భూమిని సిసోడియా పరిశీలించారు. తర్వాత విజయనగరం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. 22ఏ కేటగిరి భూములు, ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్, భూముల రీసర్వే తదితర అంశాలపై పలు సూచనలిచ్చారు. తర్వాత ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో అధిక శాతం గతంలో స్పందనకు వచ్చినవే కావడంతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశీలనకు పంపించారు. రెవెన్యూ సమస్యలపై కొంతమందికి కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని చెప్పేశారు. సాయంత్రం విశాఖకు తిరుగు ప్రయాణంలో ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ ఉన్నారు.